# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 162 | విశాఖపట్నం | 14-3-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 162 | VISAKHAPATNAM | 14-3-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



**రిపోర్టర్లు కావలెను**

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## 6 నెలల్లో స్థానిక సంస్థల

# ఎన్నికలు జరగొచ్చు: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికలు 6 నెలల్లో జరగొచ్చు, అందుకు సిద్ధంగా ఉండాలని మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. వైఎస్సార్సీపీ చేసిన విధ్వంసాన్ని చెప్తూనే కూటమి ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికలల్లో మనం గెలిచామన్న చంద్రబాబు, ఎన్నిక ఏదైనా కూటమిదే గెలుపు కావాలని స్పష్టం చేశారు. పంచాయతీలు మాదిరిగానే నీటి సంఘాలు నీటి పన్ను వసూలు చేయాలని మంత్రి రామానాయుడుకు చెప్పారు. చేసిన పనిని మీరు మీడియాకు చెప్పుకోవడంలో విఫలమవుతున్నారని మంత్రులతో వ్యాఖ్యానించారు. మంత్రివర్గంలో అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై సీఎం మంత్రులతో చర్చించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్ల గ్యాస్ కొరత తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. కొందరు గ్యాస్?కి ప్రత్యామ్నాయశీగా ఎలక్ట్రిక్ పొయ్యిల వాడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఎలక్ట్రిక్ పొయ్యిలు ఎక్కువ వాడితే విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున, విద్యుత్ డిమాండ్ పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఏప్రిల్ 2న శాఖల పనితీరు మీద నివేదికలు ఇస్తానని ముఖ్యమంత్రి వెల్లడించారు. నివేదికలు ఆధారంగా సమీక్ష చేసుకుని పురోగతి సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 2 నుంచి 90రోజుల పాటు జలాధార కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కాలవులు, డ్రైన్లు శుభ్రం చేయించి భూగర్భ జలం పెంచటమే లక్ష్యంగా జలాధార చేపట్టాలన్నారు. మే 15 కల్లా సాగునీటిని విడుదల చేయాలని ఆదేశించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దాదాపు 7లక్షల ఎకరాలకు నీరందలేదన్న సీఎం, చివరి ఎకరాకు నీరిచ్చే దిశగా జలాధార జరగాలని సూచించారు. వరదల వల్ల రేపల్ల వద్ద బలహీనంగా ఉన్న కరకట్టను అభివృద్ధి చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు. ఈ నెల 16న అమరావతిలో (తరువాయి 2వ పేజీలో)



## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణ స్వీకారం

2లో



## వ్యవసాయ మార్కెట్ కమిటీలు బాగుపడేదెప్పుడు?

7లో



## వేసవికాలంలో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి..

6లో

# సిక్కోలు గడ్డపై జీఎన్ జ్యూవెలరీ కేటుగాడు అరాచకాలు

- శ్రీకాకుళం జిల్లాలో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న జీఎన్ జ్యూవెలరీ అక్రమాలు
- కేసు నమోదు చేసి 145 రోజులు గడిచినా చర్యలు శూన్యం
- తూనికలు కొలతల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో రెచ్చిపోతున్న జీఎన్ జ్యూవెలరీ యాజమాన్యం
- అడ్డగోలు అక్రమ వ్యాపారంతో కోట్లకు పడగెత్తిన జీఎన్ జ్యూవెలరీ యాజమాన్యం
- సిక్కోలు గడ్డపై అడ్డగోలుగా బంగారం వ్యాపారం
- శ్రీకాకుళంలో జీఎన్ జ్యువెలరీ అక్రమాలు
- తుకాల్లో అడ్డగోలు మోసాలు
- తూకానికి ముందు ఒక వెయిట్.. తూకం తర్వాత మరో వెయిట్
- స్కీముల పేరుతో కస్టమర్లకు కుచ్చుటోపీ
- జీఎన్ జ్యువెలరీస్ మోసాలకు సామాన్యులు బలి
- తూనికల కొలతల శాఖ అధికారుల తనిఖీల్లో బట్టబయలు
- కస్టమర్స్ కు కుచ్చుటోపీ పెడుతున్న వైనం
- తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు షాకింగ్ నిజాలు
- 400 మిల్లిగ్రాములు పైగా బంగారాన్ని తక్కువ చేసి అమ్ముతున్న కేటుగాళ్లు
- సిక్కోలు ప్రజలకు కుచ్చుటోపీ పెడుతున్న జీఎన్ జ్యువెలరీ యాజమాన్యం

భయంకరమైన నిజాలు రేపటి సంచికలో విస్తుపోయే వాస్తవాలు మీ పతాకం న్యూస్





## గ్యాస్ మార్కెట్‌కు రాష్ట్రాలదే భాధ్యత: కేంద్రం

2లో

## గ్యాస్ సంక్షోభం..

# మూతపడనున్న హోటళ్లు?



### గ్యాస్ బుక్ చేశాం..కాని ఎప్పుడూ వస్తుందో తెలియదంటున్న గృహ వినియోగదారులు

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం విశాఖ హోటళ్ల రంగంపై ప్రభావం చూపుతోంది. గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో నగరంలో హోటళ్ల నిర్వహణ కష్టతరంగా మారింది. అక్కడక్కడా చిన్న చిన్న హోటళ్లు మూతపడ్డాయి. పరిస్థితి మరో రెండు రోజులు ఇలాగే కొనసాగితే చాలా హోటళ్లు మూతపడే అవకాశముంది. ఆహార పదార్థాల విక్రయ ధరలు మరింత పెరిగే అవకాశముంది. విశాఖ నగరంలో ఒక రోజుకు 70 వేల వరకు వాణిజ్య సిలిండర్లు అవసరం కాగా ప్రస్తుతం 12 వేల నుంచి 15 వేల వరకు మాత్రమే సరఫరా అవుతున్నట్టు తెలుస్తోంది. ఇదే అదునుగా బ్లాక్ మార్కెట్ పుంజుకుంది. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం గృహ అవసరాల వంటగ్యాస్ ధరను రూ.60, వాణిజ్య వంటగ్యాస్ ధరను రూ.115 పెంచిన విషయం తెలిసిందే. ధర పెరిగినప్పటికీ నగరంలో వాణిజ్య అవసరాలకు ఉపయోగించే వంటగ్యాస్ లభ్యత బాగా తగ్గడంతో పెద్ద, పెద్ద హోటళ్ల వారితో పాటు, చిన్న చిన్న హోటళ్లు, తోపుడు బండ్లు వగైరా వాటిపై తినుబండారాలను తయారుచేసి విక్రయించేవారు గ్యాస్ లభించక, ఒకవేళ లభించినా ధర అధికం కావడంతో గగ్గోలు పెడుతున్నారు. పెరిగిన ధరతో వాణిజ్య అవసరాల సిలిండర్ రూ.1850కి సరఫరా చేయవలసి ఉండగా, రూ.2 వేల వరకూ తాము చెల్లించాల్సి వస్తోందని విశాఖ జిల్లా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాలకృష్ణ తెలిపారు. నాలుగు రోజులుగా రోజుకు రూ.100 చొప్పున సిలిండర్ ధర అధికారికంగా పెరుగుతూ వస్తోందని, ఈ విధంగా ఎప్పుడూ లేదని అన్నారు. ఇదే విధంగా కొనసాగితే సిలిండర్ ధర రూ.3 వేలకు చేరే అవకాశం ఉందన్నారు. నగరంలో చిన్న, పెద్ద హోటల్స్ అన్నీ కలిపి 1500 వరకు ఉంటాయని తెలిపారు. హోటల్ పరిశ్రమను ఆదుకోవాలని, వాణిజ్య సిలిండర్ ధర మరింత పెంచకుండా చూడాలని, లేకుంటే హోటల్స్ మూతపడే పరిస్థితి ఉంటుందని జాయింట్ కలెక్టర్‌కు తమ అసోసియేషన్ తరపున ఇప్పటికే వినతిపత్రం ఇచ్చామన్నారు. ధరల పెరుగుదల ఇలా.. అక్కడక్కడా నగరంలోని హోటళ్లలో ఆహార పదార్థాలపై గతంకంటే రూ.5 నుంచి (తరువాయి 3వ పేజీలో)

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## కార్యాచరణ

రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు వేసవి ప్రణాళికను ప్రకటించింది. 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026' పేరుతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రూపొందించిన ఈ ప్రణాళికలో వడదెబ్బ కారణంగా రాష్ట్రంలో ఒక్క ప్రాణం కూడా పోకుండా చూడాలని అధికార యంత్రాంగానికి నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకటించారు. ఈ దిశలో జిల్లాల కలెక్టర్లకు కొన్ని నిర్ధిష్ట సూచనలను కూడా ప్రణాళికలో పేర్కొన్నారు. అయితే, రాష్ట్రంలో ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. ఫిబ్రవరి నెలాఖరులోనే వేసవిని తలపించింది. ఈ నెల మొదటి వారంలోనే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. నెల్లూరు జిల్లా కావలిలో ఆరవ తేదీన 40డిగ్రీలు, ఒంగోలు, తిరుపతి, కర్నూలు, అమరావతి వంటి ప్రాంతాల్లో 38-39 డిగ్రీలు ఉష్ణోగ్రతలు చోటుచేసుకున్నాయి. రానున్న రోజుల్లో మరో రెండు, మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అంటే, 42 నుండి 43 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకునే అవకాశం ఉందని అర్ధం. మార్చి నెల ప్రథమార్ధంలోనే ఈ స్థాయిలో ఎండలు ఉంటే, ఏప్రిల్, మే నెలల్లో ఏ స్థాయికి చేరుతాయో అర్ధం చేసుకోవచ్చు. గత కొన్ని సంవత్సరాలుగా నెలకొంటున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుంటే రాష్ట్రంలో ఇప్పటికే కార్యాచరణ ప్రారంభమై ఉండాలి. కానీ, అలా జరగలేదు. ఇప్పటికైనా ప్రణాళికను ఆవిష్కరించారు కనుక ఆ దిశలో ప్రభుత్వ అడుగులు వేగంగా పడాలి. వడదెబ్బ బాధితుల కోసం ఆస్పత్రులలో ప్రత్యేక బెడ్లు, మందులు సిద్ధం చేయాలని, తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగాలని, మార్కెట్లు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, వృద్ధులు, చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ప్రణాళికలో పేర్కొనడం మంచిదే! అయితే, ఇలాంటి ప్రణాళికలు గతంలోనూ ప్రకటించడం, అమలులో అనేక లోపాలు బయటపడటం విస్మరించకూడదు. ప్రణాళిల్లో పేర్కొన్న అంశాలు ఎలా ఉన్నప్పటికీ వాటి అమలుకు చాలినన్ని నిధులు అందుబాటులో ఉండక పోవడం గతంలో అనేక సందర్భాల్లో కీలకాంశంగా ముందుకు వచ్చింది. నిధుల కొరత కారణంగానే అనేక స్థానిక సంస్థలు తాగునీటిని కూడా సక్రమంగా సరఫరా చేయలేని ఉదాహరణలు కోకొల్లలు! ఆసుపత్రులలో బెడ్లు, మందుల పరిస్థితి కూడా ఇంతే! అందువల్ల నిధుల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. వేసవి కష్టాలను ఎదుర్కోవడం కేవలం విపత్తు నిర్వహణ శాఖ బాధ్యత మాత్రమే కాదు. అనేక శాఖలు సమన్వయంతో దీనిని సాధించాలి. ఎండలు తీవ్రమౌతున్న నేపథ్యంలో పాఠశాలల సమయాలు మార్చడం వంటి అంశాలను ప్రభుత్వం తక్షణం పరిగణలోకి తీసుకోవాలి. వేసవి తీవ్రత పెరిగే కొద్దీ శ్రమ జీవుల కష్టాలు కూడా తీవ్రమవుతాయి. ఉపాధి హామీ పేదలు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీల పై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. మధ్యాహ్న సమయాల్లో పనిచేయాల్సి రావడం ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదంగా మారుతోంది. ప్రతి సంవత్సరం వడదెబ్బ బారిన పడుతున్న వారిలోనూ, ప్రాణాలు కోల్పోతున్న వారిలోనూ పెద్ద సంఖ్యలో ఉపాది హామీ కార్మికులు ఉండటం గమనార్హం. దీనిని పరిగణనలోకి తీసుకుని ఉపాధి పనుల వేళలను తక్షణమే మార్చాలి. అలాగే ఉపాధి పనులు జరిగే చోట తాగునీటిని అందుబాటులో ఉంచడంతో పాటు, షామియానాలు వంటి అవసరమైన ఇతర జాగ్రత్తలు తీసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులున్న ప్రతిచోటా ఈ తరహా చర్యలను చేపట్టాలి. మహిళా కార్మికులకోసం మరిన్ని ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో ఈ కష్టజీవులకు లభించిన స్థానం నామమాత్రమే! ప్రభుత్వం వీరి భద్రత కోసం మరింతగా దృష్టి సారించాల్సి ఉంది. వేసవి కాలంలో అగ్నిమాపక శాఖ ప్రాధాన్యతను, నగరాలు, పట్టణాల్లో హరిత వాతావరణాన్ని పెంచడం, కాలుష్యాన్ని నివారించడం, మొక్కలు పెంచడం వంటి చర్యల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఏమైనప్పటికీ, ఈ తరహా చర్యలు కాగితాలకే పరిమితమైతే ఎటువంటి ప్రయోజనం లేదు. కార్యాచరణలో కనిపించినప్పడే ప్రజలకు రక్షణ లభిస్తుంది.

## గ్యాస్ బ్లాక్‌మార్కెట్‌కు రాష్ట్రాలదే బాధ్యత: కేంద్రం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వంట గ్యాస్ కొరతకు సంబంధించి బ్లాక్ మార్కెట్‌ను రాష్ట్రాలే నిరోధించాలని కేంద్రం స్పష్టం చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) లేదా ఫ్యూయల్ ఆయిల్ వంటి ఇంధనాలకు ఎటువంటి కొరత లేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పార్లమెంట్‌లో వెల్లడించారు. వినియోగదారుల ఆందోళన కారణంగానే పంపిణీదారులు, రిటైల్ స్థాయిలో నిల్వ, బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందని, సరఫరా కొరత లేదని ఆయన లోక్‌సభలో తెలిపారు. భారతదేశం గతంలో గల్ఫ్ దేశాల నుండి 60 శాతం ఎల్‌పిజిని దిగుమతి చేసుకునేదని, 40 శాతం దేశీయంగా ఉత్పత్తి అవుతుందని వివరించారు. గల్ఫ్ వనరులతో పాటు అమెరికా, నార్వే, కెనడా, అల్జీరియా, రష్యా నుండి కూడా ఎల్‌పిజిని వేగవంతంగా సేకరిస్తున్నామని తెలిపారు. దేశీయ సరఫరా సజావుగా ఉందని, డెలివరీ పక్రీయ మారలేదని, బుకింగ్ నుండి డెలివరీకి సమయం 2.5 రోజులు అని పేర్కొన్నారు. ఆసుపత్రులు, విద్యా సంస్థలకు ప్రాధాన్యత ప్రాతిపదికన సరఫరా జరుగుతోందని మంత్రి తెలిపారు. సరఫరా పరిమితి వాతావరణంలో బ్లాక్ మార్కెట్ పనిచేస్తోందని, ఇది నిల్వ, దారి మళ్లింపు, అధిక ధరలకు తిరిగి అమ్మకానికి దారితీసిందని అంగీకరించారు. నిల్వను నిరోధించడానికి, ప్రభుత్వ యాజమాన్యంలోని ఐఒసిఎల్, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయంతో ఈ కమిటీ పనిచేస్తుందని ఆయన తెలిపారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్.జె.దొర మృతి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్.జె.దొర మృతిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా, డీజీపీగా ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పోలీసు శాఖలో పలు సంస్కరణలు తీసుకురావడంతో పాటు శాఖను ప్రజలకు చేరువ చేయడంలో హెచ్.జె.దొర ఎంతో కృషి చేశారని తెలిపారు. దొర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ డీజీపీ హెచ్.జె.దొర నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం హైదరాబాద్‌లో మరణించారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. 1965 ఐపీఎస్ బ్యాచ్ అధికారి అయిన ఆయన గత కొద్ది రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. 1996 నుంచి 2002 వరకు ఏపీ డీజీపీగా దొర విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఉమ్మడి ఏపీలో నక్సలైట్లను అణిచి వేయడంలో కీలకంగా వ్యవహరించారు. అలాగే సీఐఎస్ఎఫ్ డీజీగా, విజిలెన్స్ కమిషనర్‌గా సైతం దొర పని చేశారు.

## అసోం నుంచి తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే అమృత్ భారత్ రైలును ప్రారంభించిన మోడీ




**అసోం:** రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈ రైలును ప్రధాని అసోంలో ప్రారంభించారు. అసోంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కామాఖ్య, చర్లపల్లి మధ్య స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ఈ రైలు సేవలు అందించనుంది. దీనితో ఈశాన్య ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులకు తక్కువ ఛార్జీలతో సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ఈ రైలు మార్గమధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం జంక్షన్, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమహేంద్రవరం, తణుకు, భీమవరం పట్టణం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ స్టేషన్లలో ఆగుతూ, అక్కడి నుంచి చర్లపల్లికి చేరుకుంటుంది.

## శ్రీశైలంలో యాత్రికులపైకి దూసుకెళ్లిన వాహనం



**శ్రీశైలం, పతాకం న్యూస్:** ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో శుక్రవారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. ఆలయ టోల్ గేట్ వద్ద వేగంగా వచ్చిన ఓ వాహనం నియంత్రణ కోల్పోయి అక్కడే ఉన్న యాత్రికులపైకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో 10 మందికిపైగా గాయాలయ్యాయి. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వెంటనే స్పందించిన ఆలయ సిబ్బంది, తోటి యాత్రికులంతా కలిసి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే వాహన డ్రైవర్‌ను స్థానికులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వాహనం బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందా.. లేక డ్రైవర్ అజాగ్రత్త కారణమా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణ స్వీకారం



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. పంజాబ్-హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 3వ స్థానంలో కొనసాగుతుండగా, ఆమెను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఇటీవల ఆమోదం ముద్ర వేశారు. హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 2వ స్థానంలో కొనసాగుతారు. హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ హైకోర్టు సీజేగా ఆ స్థానంలో కొనసాగుతారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 33 ఉంది. తాజాగా జస్టిస్ లిసా గిల్ రాకతో ఆ సంఖ్య 34కు చేరింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ స్వస్థలం చండీగఢ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య అభ్యసించారు. ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యూమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. జస్టిస్ లిసా గిల్ 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, పంజాబ్?-హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవిన్యూ, రాజ్యాంగ పరమైన కేసుల ద్వారా అన్ని రంగాల్లో అనుభవం గడించారు. ఆమె సుదీర్ఘ కాలం పాటు చండీగఢ్?కు పలు కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ బోర్డులకు ప్రాతినిధ్యం వహించారు. అనంతరం 2014 మార్చి 31న పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. పంజాబ్-హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సేవలు అందించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ఇటీవల కొలీజియం సమావేశమైన విషయం తెలిసిందే. ప్రస్తుత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ) సీజే పదవీకాలం ఏప్రిల్ 24తో ముగుస్తుంది.

## అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు పనుల్లో భూ సమస్య ఉంది: నారాయణ



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో అత్యంత కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు పనులను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉండవల్లి వద్ద బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మిస్తున్న అత్యాధునిక స్టీల్ బ్రిడ్జ్ పనులను పర్యవేక్షించిన ఆయన, రాజధాని కనెక్టివిటీపై కీలక ప్రకటనలు చేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డును మంగళగిరి ప్రధాన రహదారికి అనుసంధానించే క్రమంలో ఇంకా 4.5 ఎకరాల భూమికి సంబంధించిన సమస్య పెండింగ్‌లో ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఈ భూమిని సేకరించేందుకు ప్రభుత్వానికి చట్టపరంగా అవకాశం ఉన్నప్పటికీ, రైతులకు మరో నెల రోజుల పాటు వెసులుబాటు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 9 నాటికి రైతులు స్వచ్ఛందంగా భూసమీకరణకు ముందుకు రాకుంటే, ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాజధాని అభివృద్ధి దృష్ట్యా రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.స్టీల్ బ్రిడ్జి పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని... ఈ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థలు హామీ ఇచ్చాయని మంత్రి తెలిపారు. బకింగ్‌హామ్ కెనాల్ కంటే ముందుగా గుంటూరు ఛానల్, కొండవీటి వాగులపై మరో రెండు స్టీల్ బ్రిడ్జిలు రానున్నాయని... ఇవి కూడా పూర్తి అయితే సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం పూర్తయినట్టేనని చెప్పారు.

## పలాసలో తొలి కిడ్నీ మార్పిడిశస్త్ర చికిత్స విజయవంతం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలోని పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో నిర్వహించిన తొలి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. యువతి హేమశ్రీకి వైద్యులు కిడ్నీ రీ ప్లాంటేషన్ చేశారు. ఈ శాస్త్ర చికిత్స పూర్తయిన తర్వాత హేమశ్రీతో పాటు ఆమె తండ్రిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ.. చాలా కాలంగా ఉద్దానాన్ని కిడ్నీ భూతం ఇబ్బంది పెడుతుందని తెలిపారు. అలాంటిది శుక్రవారం పలాసలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతం కావ డంతో తనకు చాలా సంతోషంగా ఉం దన్నారు. మారుమూల ప్రాంతంలోని నిరుపేద యువతి కిడ్నీ సమస్యతో బాధ పడుతుందని చెప్పారు. ఆమెకు ప్రముఖ వైద్యులంతా వచ్చి ఈ శస్త్ర చికిత్స నిర్వహించారని చెప్పారు.

(మొదటిపేజీ తరువాయి)

## ఎన్నికలు జరగొచ్చు: చంద్రబాబు

పొట్టిశ్రీరాములు విగ్రహావిష్కరణ చేపడుతున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ పొట్టిశ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణాలకు ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్లకు పరిపాలనా అనుమతులిచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అమరావతి అభివృద్ధి, ఉపాధి సృష్టి, జలవనరులు, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, విద్యుత్ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఆర్డీఏ నిర్ణయాలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

# అనకాపల్లిలో ఆపరేషన్ వజ్రప్రహార్



**అనకాపల్లి, పతాకం న్యూస్:** మాదక ద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా అరికట్టడానికి చేపట్టిన ఆపరేషన్ వజ్రప్రహార్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు అనకాపల్లి పట్టణంలోని ఏఎంసీ కాలనీ, చేపల బజార్, విజయరామరాజుపేట ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి ఉదయం 7.30 గంటల వరకు చేట్టిన ఈ కార్యక్రమంలో 14 మంది పోలీసు అధికారులు, 90 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. నివాసాలు, వినియోగంలో లేని ఇళ్లు, ఖాళీ ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. గంజాయి కేసుల్లో ప్రమేయం ఉన్న వారి ఇళ్లల్లో క్షుణ్ణంగా సోదాలు చేశారు. ఎటువంటి రికార్డులు లేని తొమ్మిది ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నిమ్మకాయల జ్యోతి సూర్య ప్రభాకర్ అలియాస్ జ్యోతి ఇంటి వద్ద మూడు కిలోల గంజాయి, దొడ్డి తిమోతి అలియాస్ ఆది ఇంటి వద్ద నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మల్లంపర్తి గణేశ్ ఇంటి వద్ద మెపెన్‌ట్రిమైన్ సల్ఫేట్ 165 ఇంజక్షన్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రావణి మాట్లాడుతూ, డ్రగ్స్ రహితసమాజం ఏర్పాటుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ జి.ప్రేమ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ విశాఖ అందరి లక్ష్యం: కేతన్‌గార్గ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** దేశంలోనే విశాఖకు మొదటి పరిశుభ్ర నగర స్థాయి లక్ష్యంగా కృషి చేయాలని, 2025 -- 26 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అన్ని పారామితులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టి విధులు నిర్వహించాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ జివిఎంసి ఉన్నతాధికారులను, జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ఆయన విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ థియేటర్‌లో జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ, పి.నల్లనయ్య, ప్రధాన ఇంజినీరు సత్యనారాయణ రాజు, సిసిపి ఎ.ప్రభాకర్ రావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చేపట్టవలసిన పారామితులు, కార్యాచరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణలో జివిఎంసికి మొదటి ర్యాంకు లక్ష్య సాధనకు అన్ని విభాగ అధికారులు సంయుక్తంగా పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా డోర్ టు డోర్ కలెక్షన్, వ్యర్థాల విభజన, పౌరుల ఫీడ్‌బ్యాక్‌పై అవగాహన కార్యక్రమాలు, ఎన్జీవోలు, సోషల్ ఆర్గనైజేషన్లు, నివాసిత సంక్షేమ సంఘాల సహకారం, సి అండ్ డి వేస్ట్, పింక్ టాయిలెట్స్, ప్రజా మరుగుదొడ్లు, పాఠశాల మరుగుదొడ్లు, గ్రీన్ బెల్ట్, త్రిబుల్ ఆర్ సెంటర్ల నిర్వహణపై నిత్య పర్యవేక్షణ, వ్యర్థాల విభజన, బహిరంగ మల, మూత్ర విసర్జన, మొదలైన అంశాలను పరిగణనలోనికి తీసుకొని పై స్థాయి అధికారుల నుండి సచివాలయం కార్యదర్శుల వరకు వారి వారి విధి విధానాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 12,500 మార్కులు ఉన్నాయని, ఎటువంటి తప్పిదం జరిగినా మార్కులు కోల్పోవడంతో పాటు వ్యతిరేక మార్కులు పడతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి అధికారి విధుల్లో అలసత్వం వహించకుండా పనిచేయాలన్నారు. అనంతరం అధికారులు పారామితులకు అనుగుణంగా విధులు ఏ విధంగా నిర్వహించాలో తెలపాలని కమిషనర్ కోరగా, ప్రతి అధికారి వారి చేయబోయే విధులను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో అందరు జోనల్ కమిషనర్లు, సహాయక వైద్యాధికారులు, సానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## విశాఖలో పెరుగుతున్న గ్యాస్ ఇబ్బందులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జిల్లాలో వంట గ్యాస్ ఇబ్బందులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇళ్లలో ఉపయోగించే డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాకు ప్రస్తుతం ఇబ్బందులు లేకున్నా హోటళ్లు, రెస్టారెంట్లు, వాణిజ్య సంస్థలకు సరఫరా చేసే వాణిజ్య సిలిండర్లు మాత్రం 90 శాతం మందికి అందడం లేదు. ఈ సిలిండర్ల ఫిల్లింగ్‌ను నిలిపివేశారు. గ్యాస్ డీలర్ల వద్ద స్టాకులు పూర్తిగా తగ్గిపోయాయి. అరకొరగా ఉన్నవారు ప్రధాన స్టార్ హోటళ్లకు రేషన్ ప్రకారం అందిస్తున్నారు. జగదాంబ సెంటర్‌లో ఉన్న ప్రముఖ హోటల్‌కు రోజుకు 20 సిలిండర్లు అవసరం కాగా వారికి పది ఇవ్వడం కూడా కష్టంగా ఉంది. ఇలా స్టార్ హోటళ్లకు డిమాండ్‌లో 40 నుంచి 50 శాతం మాత్రమే అందుతున్నాయి. సాధారణ హోటళ్లు, రెస్టారెంట్లు, మెస్‌లకు అసలు అందడం లేదు. దాంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని సరఫరా చేయకపోతే వ్యాపారాలు మూసుకోక తప్పదని వారు వాపోతున్నారు. వాణిజ్య గ్యాస్ కొరత తీవ్రం కావడంతో జాయింట్ కలెక్టర్ విద్యాధరి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి నగరంలోని గ్యాస్ డీలర్లను, హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులను పిలిపించారు. తమ వద్ద డొమెస్టిక్ తప్ప వాణిజ్య సిలిండర్లు లేవని, కంపెనీలు సరఫరా చేయడం లేదని డీలర్లు స్పష్టంచేశారు. తమకు వాణిజ్య సిలిండర్లు సరఫరా చేయకపోతే వ్యాపారాలు చేసుకోలేమని, ఏదోవిధంగా చూడాలని హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. అందుకు జేసీ వారికి స్పష్టమైన హామీ ఇవ్వలేకపోయారు. ఈ సందర్భంగా జేసీ విద్యాధరి మాట్లాడుతూ, ఎవరైనా సరే నిబంధనలకు వ్యతిరేకంగా డొమెస్టిక్ సిలిండర్లు వాడితే ఇచ్చిన వారిపైనా, ఉపయోగిస్తున్న వారిపైనా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. వాణిజ్య సిలిండర్ల సరఫరా లేకపోవడంతో డొమెస్టిక్ సిలిండర్లకు డిమాండ్ ఏర్పడింది. దీంతో గ్యాస్ సరఫరా చేసే బాయ్‌లు డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.960 కాగా బయట రూ.1,500 చొప్పున అమ్ముకుంటున్నారు.

## దుకాణాలపై విజిలెన్స్ దాడులు



**భోగాపురం, పతాకం న్యూస్:** ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా యుద్ధం నేపథ్యంలో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు భోగాపురం, సవరవల్లి గ్రామాల్లోని పలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. సవరవల్లి గ్రామంలో మణికంఠ ఫుడ్‌బేకరీ షాపులో తనిఖీలు నిర్వహించగా.. నిబంధనలకు విరుద్ధం గా ఉన్న 13 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను, భోగాపురం అపర్ణ హోటల్‌లో 3 డొమె స్టిక్ గ్యాస్ సిలిండర్లను గుర్తించి, సీజ్ చేశారు. 6ఏ కేసు నమోదు చేశారు. ఈ 16 సిలిండర్లను స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ సింహాచలం, తహసీల్దార్ వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

## మూతపడనున్న హోటళ్లు?

### (మొదటిపేజీ తరువాయి)

రూ.10 ధర పెరిగింది. కూర్మన్నపాలెం, గాజువాక వంటి ప్రాంతాల్లో ఐదు రోజుల క్రితం వరకూ ఇరానీ టీ రూ.15 ఉండగా నేడు రూ.20కి పెంచి విక్రయిస్తున్నారు. ఆయిల్ ఎక్కువగా అవసరమయ్యే ఆహార పదార్థాలను చాలా హోటళ్లు తగ్గించేశాయి. పలు హోటళ్ల మెనూలో దోశ కనిపించడం లేదు. స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ఫుడ్ ప్లాట్‌ఫారమ్స్‌పైనా యుద్ధం, గ్యాస్ కొరత, హోటళ్ల మూత ప్రభావం పడింది. ఆన్లైన్ ఫుడ్ డెలివరీలు కాసింత తగ్గాయి. దీంతో గిగ్ వర్కర్లకు వచ్చే ఆదాయం తగ్గుముఖం పట్టింది. మరో పక్క ఆన్‌లైన్‌లో గ్యాస్ బుకింగ్ కోసం గ్యాస్ సరఫరా కంపెనీలు ఇచ్చిన నెంబర్లు గురువారం చాలాసేపు పనిచేయలేదు. దీంతో వినియోగదారులు నేరుగా గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లడంతో అక్కడా రద్దీ వాతావరణం నెలకొంది.అనకాపల్లిలో ఇలా.. అనకాపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల కొరత నెలకొన్నట్టు వినియోగదారులు చెబుతున్నారు. గ్యాస్ బుకింగ్ చేసినప్పటికీ సిలిండర్ డెలివరీ ఆలస్యమవుతోందని పలువురు గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్లు సమయానికి అందకపోవడంతో కొందరు హోటల్ యజమానులు తాత్కాలికంగా కట్టెలు, ఇతర ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. హాస్టళ్లలో కూడా వంట ఏర్పాట్లు చేయడం కష్టమవుతోందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

## రూ.82.98 కోట్లతో బీచ్ కోత నివారణ పనులు ప్రారంభం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ తీరప్రాంత సౌందర్యాన్ని కాపాడేందుకు, సముద్రపు కోతను అరికట్టేందుకు విశాఖపట్నం పోర్టు అథారిటీ కీలక అడుగు వేసింది. పోర్టు పరిధిలోని వివిధ ప్రాంతాలతో పాటు ముఖ్యంగా రామకృష్ణ బీచ్ వద్ద వార్షిక నిర్వహణ డ్రెడ్జింగ్ బీచ్ నరిష్మెంట్ పనులను అధికారికంగా ప్రారంభించింది. ఈ బృహత్తర ప్రాజెక్టును మొత్తం రూ.82.98 కోట్ల వ్యయంతో చేపట్టారు. ఇది మూడు సంవత్సరాల పాటు కొనసాగుతుంది. ప్రతి సంవత్సరం సగటున 2.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను సేకరించి, కోతకు గురవుతున్న తీర ప్రాంతాలకు పంపింగ్ చేస్తారు. దీనివల్ల తీరం బలోపేతం అవుతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు ఈ నెల 10న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నౌక 'డ్రెడ్జ్ శశఐ' ద్వారా ప్రారంభమయ్యాయి. 45 రోజుల పాటు ఈ పనులు సాగనున్నాయి. ఈ సందర్భంగా విపిఎ, డిసిఐ ఛైర్మన్ డాక్టర్ అంగముత్తు మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తోందన్నారు. సముద్రపు పోటు వల్ల కొట్టుకుపోయే ఇసుకను భర్తీ చేయడం ద్వారా తీరాన్ని కాపాడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ విశాఖ నగర తీర సంరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు.

## పెంచిన గ్యాస్ ధరలు రద్దు చేయాలి




**గాజువాక, పతాకం న్యూస్:** పెంచిన గ్యాస్ ధరలు రద్దు చేయాలని, ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పాత గాజువాకలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, ఇరాన్‌పై దాడులను తక్షణమే ఆపాలని కోరారు. ఈ యుద్ధం పేరుతో గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచేశారని, వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. అమెరికా తన దేశ ప్రయోజనాల గురించి నిత్యం ఏదో దేశంలో తగాదా సృష్టించి లాభం పొందాలని చూస్తుందన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఖనిజ, ఆయిల్ నిక్షేపాలను సొంతం చేసుకోవడానికి అమెరికా యుద్ధాలు చేపడుతుందని తెలిపారు. ఈ యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే ఇంధన నిల్వలు తగ్గుతాయన్నారు. గ్యాస్ కూడా అందక పిడకలతో వంటలు వంటలు చేసుకునే దుస్థితి దాపురిస్తుందని పేర్కొన్నారు. సిపిఎం జోన్ కమిటీ సభ్యులు బంగారునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు లోకేష్, కుమార్, సంతోషం, అవతారం, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అచ్యుతాపురం : యుద్ధం పేరుతో పెంచిన గ్యాస్, ఇతర నిత్యవసరకుల ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ మండలంలోని పూడిమడక గ్రామంలో గురువారం మహిళలతో గ్యాస్ సిలిండర్లు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం మండల కన్వీనర్ ఆర్ రాము, పూడిమడక గ్రామ శాఖ కార్యదర్శి చేపల తాతయ్య మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి నేపథ్యంలో బడా వ్యాపారస్తులు సాగిస్తున్న బ్లాక్ మార్కెట్‌ను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. వంటగ్యాస్ ధర పెరగడంతోపాటు బ్లాక్ మార్కెటింగ్ వల్ల సిలిండర్లు దొరకని కారణంగా దేశమంతటా నగరాలు, పట్టణాలు హోటళ్లు మూతపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సాధారణమైన తోపుడుబండ్లు, చిన్న కాకా హోటళ్ల నిర్వాహకుల బతుకులు బజారున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరత రాకుండా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గనగల నూకరాజు, చేపల రవణమ్మ, సురాడ కోటి, చౌడుపల్లి పెంటమ్మ, ఇంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రసాయన రహిత పంటలతో ఆరోగ్యానికి మేలు



**భీమిలి, పతాకం న్యూస్:** రసాయన రహిత ఆహార పంటల వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని రైతు సాధికార సంస్థ అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్యామల చెప్పారు. మండలంలోని గంధవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంలో ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ ఫుడ్ బాస్కెట్ కార్యక్రమాన్ని రైతు సాధికార సంస్థ ఎస్ఇఆర్‌పి సంయుక్తంగా నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రైతులు పండించిన రసాయన రహిత ఆహార పదార్థాలను నేరుగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని శ్యామల తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీపతి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రకృతి వ్యవసాయంలో పండించిన రసాయన రహిత ఆహారాన్ని వినియోగించడం చాలా అవసరం అన్నారు. రైతులు పండించే నాణ్యమైన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు అందించేందుకు ఈ ఫుడ్ బాస్కెట్ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రకృతి వ్యవసాయంలో పండించిన ధాన్యాలు, చిరుధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలు ఒకే చోట అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. దీనివల్ల రైతులకు మంచి మార్కెట్ అవకాశాలు లభించడంతో పాటు వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు మగ్గు చూపాలని కోరారు.

## మత్తు పదార్థాలను నిషేధించాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మత్తు పదార్థాలను నిషేధించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శ్రీపాద డిగ్రీ కాలేజీలో ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు నిషేధించాలని డిమాండ్ చేస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా ఈగల్ క్లబ్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.కల్యాణి, ఇన్‌స్పెక్టర్ బి.దామోదర్‌నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యుఎస్ఎన్.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.వెంకటరమణ, ఐద్వా కంచరపాలెం జోన్ అధ్యక్షులు కె.అనురాధ, భవాని, సుమిత్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యుఎస్ఎన్.రాజు మాట్లాడుతూ యువతకు ఉపాధి లేక గంజాయి మత్తు పదార్థాల భారిన పడుతున్నారన్నారు. యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. డ్రగ్స్‌ను నిషేధించాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిపిన బైక్ ర్యాలీ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ, జనాభాలో విద్యార్థులు, యువకుల శాతం ఎక్కువగా ఉందని, విద్యార్థుల ఐక్యతే బలమని ఆ బలాన్ని మంచి మార్గంలో వెళ్లడానికి యువత ప్రధాన పాత్ర తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## శ్రీకాకుళంలో రహదారుల అభివృద్ధికి సహకరించండి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణకు సహకరించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విన్నవించారు. నితిన్ గడ్కరీతో పార్లమెంటులోని ఆయన కార్యాలయంలో రామ్మోహన్‌నాయుడు భేటీ అయ్యారు. 'శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి 16ను ఆరు లైన్లుగా విస్తరించాలి. శ్రీకాకుళంలోని పలు ముఖ్య కూడళ్లలో ఫ్లైఓవర్లను నిర్మించాలి. రాష్ట్ర రహదారులుగా ఉన్న కళింగపట్నం- శ్రీకాకుళం-పార్వతీపురం(145 కి.మీ), గార-అలికాం-బత్తిలి(118 కి.మీ) రహదారులను జాతీయ రహదారులుగా మార్చాల'ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు కోరారు. తన విజ్ఞప్తులపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. దీంతో నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు ఆరులైన్ల జాతీయ రహదారి నిర్మిస్తే సిక్కోలుకు మహర్దశ పట్టనుందని జిల్లావాసులు భావిస్తున్నారు.

## 'స్వచ్ఛ' సర్వేలో మంచి ర్యాంకు సాధించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** పరస్పర సమన్వయంతో స్వచ్ఛ సర్వేక్షన్ 2026 సర్వేలో మెరుగైన ఫలితాలు కనబరిచి, మంచి ర్యాంకులు సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమిషనర్ బాలస్వామి కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆయన చాంబర్లో అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత అన్ని అంశాల్లో ప్రణాళికాబద్ధమైన పనితీరును కనబరచాలన్నారు. ఇందుకోసం సిబ్బంది మరింతగా కృషి చేయాలన్నారు. అవసరమైన పరిస్థితులలో సిబ్బంది సమన్వయం అవసరమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. సామాజిక దొడ్ల నిర్వహణలో లోపభూయిష్టమైన ఇబ్బందులను అధిగమించాలని ఆదేశించారు. సర్వే అధికారుల దృష్టిలో అన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నట్లు ఉండాలన్నారు. సర్వే సమయంలోనే పరిశుభ్రంగా ఉంచడం కాకుండా నిత్యం ప్రజలకు మెరుగైన సేవలు అందాలని స్పష్టంచేశారు. ఇంటింటి చెత్త సేకరణ శతశాతం జరిగే విధంగా చూడాలన్నారు. ఘన వ్యర్థాలు, వినిమయ నీటి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య కార్మికుల సంక్షేమం, ప్రజాభిప్రాయ సేకరణ, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు వంటి అంశాలలో మెరుగైన ఫలితాలు నమోదు కావాలని సూచించారు. సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఉద్యాన శాఖ అధికారి సంతోష్, డిఇలు, ఎఇలు, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

## అలుగుబిల్లి రోడ్డు ఛిద్రం



**ఎస్.కోట, పతాకం న్యూస్:** మండలంలోని అలుగుబిల్లి రోడ్డును గ్రామంలో ఉన్న క్వారీలు, క్రషర్లకు చెందిన వాహనాలు ఛిద్రం చేశాయి. ఈ క్వారీ లు, క్రషర్లకు చెందిన భారీ వాహనాలు అధిక లోడుతో రాకపోకలు సాగించడంతో ఈ రోడ్డంతా గోతులమయం గా తయారయ్యింది. ఈ రోడ్డును రెండేళ్ల కిందటే రూ.కోటి 80లక్షలతో నిర్మించారు. నిర్మించిన ఏడాదికే క్వారీ లారీల కారణంగా ఈ రోడ్డు పాడయ్యింది. దీంతో మూడు నెలల కిందట మరో రూ.ఆరు లక్షలతో రోడ్డు ను మరమ్మతులు చేశారు. అయినా మళ్లీ పాడైంది. విశాఖ జిల్లా, అల్లూరి జిల్లా నుంచి ఇక్కడ రాతి పిక్క కు, బుగ్గికి పెద్దపెద్ద లారీలతో వస్తున్నారు. వీరు తమ లారీల్లో వేయాల్సిన పరిమిత కంటే పది నుంచి 20 టన్నుల అధిక బరువు వేయడంతో రోడ్డు కుచించుకు పోతోంది. అదేవిధంగా అధిక లోడు పిక్క తీసుకెళ్లే లారీ లపై టార్పాలిన్లు కూడా లేకుండా ఈ పిక్కలు ఆటోల పై వెళ్లే విద్యార్థులపైన, ఈ దారిలో నడిచివెళ్లే రైతుల పైన పడుతున్నాయి. కొద్దిరోజుల కిందట అధిక బరువు తో వెళ్లే వాహనాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ దామోదర్ ఆదేశాలు ఇచ్చినా అమలు కావడం లేదు. అదే విధంగా ఇక్కడ నుంచి ప్రతిరోజు వేకువజాము నుంచి ఉదయం 11గంటల వరకు అధికలోడుతో వాహనాలు వెళ్తున్నా రవాణా శాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. తమ గ్రామానికి ప్రభుత్వం ఎప్పటిక ప్పుడు రోడ్లు వేస్తున్నా ఈ క్వారీల వల్ల నాశనం అవు తున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్డంతా గుంతలమయం కావడంతో తమ వాహనాలు ఎప్పటి కప్పుడే పాడవుతున్నాయని, అలాగే తమకు ఒళ్లు నొప్పు లు వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక లోడుతో వాహనాల రాకపోకలను నిలుపుదల చేయాలని వారు కోరుతున్నారు.

## కల్తీ పాల ఘటనలో మరొకరు మృతి

**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరం పట్టణంలో జరిగిన పాలు కల్తీ ఘటనకు సంబంధించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ శుక్రవారం మృతి చెందారు. రెడ్డి అనంత లక్ష్మి (వయసు 55 సంవత్సరాలు) శుక్రవారం ఉదయం 9.18 గంటలకు మృతి చెందినట్లు తెలియజేయబడింది. పాలు కల్తీ ఘటన అనంతరం తీవ్ర మూత్రపిండ వైఫల్యం సమస్యతో ఆమె బాధపడ్డారు. రాజమహేంద్రవరంలోని డెల్టా ఆసుపత్రిలో ఆమెకు చికిత్స అందించబడింది. అయితే వైద్యుల శ్రద్ధపూర్వక చికిత్స అందించినప్పటిక ఆమె మృతి చెందినట్లు ఆసుపత్రి అధికారులు అధికారికంగా ప్రకటించారు.

# అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలెండర్లు స్వాధీనం



**నిడమర్రు, పతాకం న్యూస్:** వేర్వేరు చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన 26 గ్యాస్ బండలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన బలే ఏడుకొండలు ఇంటి వద్ద 12 గ్యాస్ సిలెండర్లు నిల్వ ఉంచినట్టు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు ఏలూరు జిల్లా విజిలెన్స్ ఎస్.పి కె.నాగేశ్వరరావు తెలిపారు. తెలిసిన వారి ఇళ్ల వద్ద గ్యాస్ బండలు కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.100 లాభంతో విక్రయిస్తున్నట్టు తెలిసిందన్నా రు. రూ.37,659 విలువ కలిగిన 12 సబ్సిడీ సిలెండర్లను సీజ్ చేసి ఏడు కొండలుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నరసాపురం పట్టణంలోని ఓ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 14గ్యాస్ సిలెండర్లను గురువారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ముందస్తు సమాచారంలో తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ, సివిల్ సప్లై డీటీ మహేష్‌లు దాడులు చేశారు. ఇంటి ప్రాంగణంలో అనుమతులు లేకుండా వీటిని ఉంచినట్లు గుర్తించారు. వెంటనే వాటిని సీజ్ చేసినట్లు తహసీ ల్దార్ తెలిపారు. తోకలపల్లిలో నిర్వహించిన తనిఖీల్లో విజిలెన్స్ తసీల్దార్ బి.కన్యాకుమారి, ఎస్.ఐ. రంజిత్ కుమార్, సిఎస్‌డిటి ఎస్.కె. జరీనా పాల్గొన్నారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా కొరత ఉందంటూ వ్యాప్తిస్తున్న వదంతులను గృహ వినియోగదారులు నమ్మవద్దని పెదపాడు తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు.

## చిరుధాన్యాల సాగుకు పెద్దపీట



**చింతపల్లి, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతంలో చిరుధాన్యాల ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఆచార్య ఎన్‌జీరంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. వ్యవసాయశాఖ మార్కెట్ యార్డులో మెగా రాగి మేళాను నిర్వహించారు. ఏడీఏ బీవీ తిరుమలరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆళ్ల అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో చిరుధాన్యాల ఉత్పత్తికి కేవలం గిరిజన ప్రాంతం మాత్రమే అత్యంత అనుకూలమన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో చిరుధాన్యాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి అవసరమైన చిరుధాన్యాలు గిరిజన ప్రాంతంలోనే ఉత్పత్తి అవుతాయని చెప్పారు. గతంలో ఆదివాసీలు రాగి, కొర్ర, సామ, జొన్నలను సాగు చేసేవారన్నారు. కాలక్రమేణా చిరుధాన్యాల సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. చిరుధాన్యాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు వ్యవసాయశాఖ కృషి చేస్తున్నదన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో రాగి సాగును ప్రోత్సహిస్తుందని చెప్పారు. గతంతో పోల్చుకుంటే రాగిలో దిగుబడి శాతం రెండేళ్లగా గణనీయంగా పెరిగిందన్నారు. గిరిజన రైతులకు మేలిరకం రాగి వంగడాలను అందించేందుకు పరిశోధనలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఇంద్రావతి, చంపావతి, భారతి, శ్రీచైతన్య, తెల్లరాగులు(హిమ) సువర్ణముఖి రకాలను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. గిరిజన రైతులు దీర్ఘకాలిక రకాలను విడిచిపెట్టి స్వల్పకాల రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. రైతులు ఆధునిక యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. గులి, జమున పద్ధతిలో సాగు చేసుకోవాలన్నారు. రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులను పూర్తిగా విడిచిపెట్టాలన్నారు. రైతులకు సేంద్రీయ ఎరువులను ప్రభుత్వం అందుబాటులోకి తీసకొచ్చిందన్నారు. ఏడీఏ బీవీ తిరుమలరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంత రైతులకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తుందన్నారు. రాజ్‌మా విత్తనాలను 90 శాతం రాయితీపై అందిస్తుందని చెప్పారు. ఈ ఏడాది రాజ్‌మా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. దీంతో రైతుల ఆదాయం రెట్టింపు అయిందన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం సుఖీభవ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. రాయితీపై యంత్రపరికరాలు అందజేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించిందని చెప్పారు. రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తారన్నారు. అనంతరం రాయితీ యంత్రాలు, వినియోగంపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలకు వివరించారు. మేళాలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు, సేంద్రీయ ఎరువులు, యంత్రాల స్టాళ్లను గిరిజన రైతులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి టి.మ?ధుసూదనరావు, ఎంపీపీ కోరాబు అనుషదేవి, ఏఎంసీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ, వైస్ చైర్మన్ హశ్వంత్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గెమ్మెలి అబ్బాయినాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, ఏఎంసీ డైరెక్టర్లు పెదిరెడ్ల బేతాళుడు, చెన్నకేశ్వరనాయుడు, ఈశ్వరమ్మ, పీఏసీఎస్ కార్యదర్శి జగన్మోహన్‌రావు, శాస్త్రవేత్తలు సందీప్ నాయక్, జోగారావు , కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 8 వేల పార్టీ జనసేన సభ్యత్వ సభ్యత్వాల నమోదు



**పాలకొండ, పతాకం న్యూస్:** నియోజకవర్గంలో ఇప్పటివరకూ 8 వేల పార్టీ సభ్యత్వాలను స్వీకరించామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన సభ్యత్వ నమోదు రాష్ట్రం అంతటా పండుగలా జరుగుతోందన్నారు. కార్య క్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకు వెళుతున్న జనసేన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. రూ.400తో సభ్యత్వం పొందితే రానున్న రోజుల్లో పార్టీ నుంచి చేపట్టబోయే కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు కార్యకర్తల కుటుంబానికి భరోసా ఉంటుందన్నారు. పాలకొండ నియోజకవర్గంలో సుమారుగా రూ.35 లక్షలను జనసేన కార్యకర్తల కుటుంబాలకు అందిం చామన్నారు. మార్చి 17 వరకు జరిగే జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్య క్రమంలో అందరూ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తోయక సంధ్యారాణి, కూటమి నాయకులు గర్భాన సత్తిబాబు, కర్నేన అప్పలనాయుడు తదితరులున్నారు.

## 120 కిలోల గంజాయితో నలుగురి అరెస్టు



**మాకవరపాలెం, పతాకం న్యూస్:** మండలంలోని పైడిపాల సెంటర్ వద్ద 120 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్టు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు వెల్లడించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని పైడిపాల సెంటర్ వద్ద ఉదయం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నర్సీపట్నం వైపు నుంచి తాళ్లపాలెం వైపు వెళుతున్న బైక్, మినీ ట్రక్కును ఆపారు. ఈ క్రమంలో ట్రక్కులో నుంచి ముగ్గురు వ్యక్తులు దూకి పరారయ్యారు. ట్రక్కును తనిఖీ చేయగా 120 కిలోల గంజాయి బయటపడింది. ట్రక్కులో వున్న ముగ్గురితోపాటు బైక్‌పై వెళుతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వీరు గొలుగొండ మండలం పోలవరం గ్రామానికి చెందిన కొప్పి సత్తిబాబు, పాకలపాడుకు చెందిన కర్రి కృష్ణ, మాకవరపాలెం మండలం పెద్దిపాలేనికి చెందిన పైల సురేశ్, నర్సీపట్నానికి చెందిన పరవాడ శ్రీనివాసరావుగా గుర్తించారు. ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి తాళ్లపాలెం మీదుగా విజయవాడకు తరలిస్తున్నట్టు నిందితులు చెప్పారు. పరారైన ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మినీట్రక్కు, బైక్‌తోపాటు నాలుగు మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదరనాయుడు,. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛతతోనే ఆరోగ్యకరమైన సమాజం



**పలాస, పతాకం న్యూస్:** స్వచ్ఛ మైన గ్రామాలు, పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండలం రెంటికోట గ్రామంలో గ్రామ పారిశుధ్య నిర్వహణ కోసం కే టాయించిన స్వచ్ఛరథాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛ రథం అనేది కేవ లం చెత్తను ఎత్తడానికే కాదని, గ్రామాన్ని ఆరోగ్యం గా ఉంచేందుకు, పరిశుభ్రకరమైన వాతావరణానికి ప్రధానంగా ఈ వాహనం నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై సహకారం అందజేయాలన్నారు. త డిచెత్త, పొడిచెత్తను క్ర మపద్ధతిలో సేకరించి సేంద్రియ ఎరువు కోసం పునర్వినియోగం చేసేలా వినియోగించడమే ఈ స్వచ్ఛరథం ప్రధాన ల క్ష్యమన్నారు. ప్రజలు చె త్తను ఆరుబయట వేయకుండా వాహనానికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, కార్యదర్శి డి.సంతోష్, ఏఎంసీ చైర్మన్ వంకల కూర్మారావు, టీడీపీ నాయకులు హొరియా మోహనరావు, కుమారరాజు తదతరులు పాల్గొన్నారు.

## రోడ్డుపైనే చెత్త డంపింగ్



**టెక్కలి, పతాకం న్యూస్:** టెక్కలికి ఆనుకొని ఉన్న తొలుసురుపల్లి పంచాయతీకి వెళ్లే మార్గంలో రహదారి పక్కనే చెత్తను డంపింగ్ చేస్తున్నారు. వాస్తవానికి టెక్కలిలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాల్సిఉంది. అయితే టెక్కలి పంచాయతీకి నిర్దిష్టమైన డంపింగ్ యార్డు లేకపోవడంతో ఎన్టీఆర్‌కాలనీ, శ్రీనివాసనగర్ తదితర వీధులు నుంచి సేకరించిన చెత్తను తొలుసురుపల్లికి వెళ్లే మార్గంలో చెరువు పక్కన వేసేస్తున్నారు. చెత్త రోజుల తరబడి నిల్వ ఉండడంతో వర్షానికి తడిచి, ఎండకు ఎండుతుండడంతో దుర్వాసన వెలువడుతోందని, దీనికితోడు చెత్త చెరువులోకి చేరుతుండడంతో నీరు కంపు కొడు తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈమార్గంలో అక్కవరం, తొలుసురుపల్లి, భగవాన్‌పురం, చింతలగార, కొత్తపేటనుంచి వందలాది మంది టెక్కలి వస్తుంటారు. కాగా కార్యదర్శి తెలియజేసి పరిశుభ్రంగా చేయిస్తామని ఈవోపీఆర్డీ సింహాద్రి తెలిపారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఎన్‌హెచ్ పక్కన ఉన డంపింగ్ కేంద్రానికి తరలిస్తున్నట్లు చెప్పారు.

## ఎట్టకేలకు కోతల్లేకుండా ఫీజుల విడుదల



**అమరావతి, పతాకం న్యూస్:** ఫీజుల విడుదల ప్రక్రియలో పెట్టిన 'వడ్డీ' మినహాయింపు మెలిక, దాదాపు నెల రోజుల జాప్యంపై వచ్చిన విమర్శలతో ఉన్నత విద్యా శాఖ అధికారులు పొరపాటును సరిదిద్దుకున్నారు. కాలేజీ యాజమాన్యాల ఫిర్యాదులపై సీఎం స్పందనతో ఎట్టకేలకు కోతల్లేకుండా మొత్తం ఫీజుల విడుదల ప్రక్రియ ప్రారంభమైంది. 2024-25కి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు ప్రభుత్వం ఫిబ్రవరి 10న రూ.1,200 కోట్ల విడుదలకు బీఆర్వోలు విడుదల చేసింది. దీంతో వెంటనే ఫీజులు తమ ఖాతాల్లో జమవుతాయని కాలేజీ యాజమాన్యాలు ఆశించాయి. కానీ ఉన్నత విద్యాశాఖ అధికారులు ఇక్కడొక మెలిక పెట్టారు. ప్రభుత్వం వద్ద నిధుల్లేకపోయినా రుణాలు తీసుకొచ్చి బకాయిలు ఇస్తున్నందున.. ఆ రుణంపై 7.5 శాతం వడ్డీ కాలేజీలు భరించాలని ప్రతిపాదన పెట్టారు. పైస్థాయి ఆదేశాలతో ఈ ప్రతిపాదన పెట్టారా? లేక అధికారుల నిర్ణయమా? అనేదానిపై తీవ్ర చర్చ జరిగింది. అనంతరం ఈ ప్రతిపాదనపై పలు దఫాలుగా యాజమాన్యాలతో అధికారులు చర్చలు జరిపారు. ఓ దశలో ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకున్నట్లుగా అగ్రిమెంట్ రాయాలని కాలేజీలకు ప్రతిపాదించారు. దీనిని యాజమాన్యాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. మాకు రావాల్సిన బకాయిలను మేం రుణం తీసుకున్నట్లు చూపడం ఏంటని ప్రశ్నించాయి. రుణం తీసుకున్నట్టు చూపించినా, ఆ రుణాన్ని ఏడాదిలో సాంఘిక సంక్షేమ శాఖ తిరిగి చెల్లిస్తుందని, ఆ భారం మీపై పడదని చెప్పినా కాలేజీలు అంగీకరించలేదు. మరోవైపు వడ్డీ కూడా భరించాలనే ప్రతిపాదనను యాజమాన్యాలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించాయి. రూ.1,200 కోట్లపై రూ.90 కోట్లు కాలేజీలు కోల్పోవాల్సి వచ్చేది. నెల రోజులు గడిచినా ఈ పంచాయతీ తేలలేదు. కొన్ని కాలేజీల యాజయాన్యాలు సోమవారం ముఖ్యమంత్రికి దాదాపు 250 ఈ-మెయిళ్ల ద్వారా ఫిర్యాదు చేశాయి. తమకు రావాల్సిన బకాయిలను తీసుకోవాలంటే వడ్డీ కట్టాలంటున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆవేదన వ్యక్తం చేశాయి. వెం టనే స్పందించిన సీఎం చంద్రబాబు.. వడ్డీ ప్రతిపాదనపై అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెంటనే స్పందించిన సాంఘిక సంక్షేమ శాఖ మొదటి దశగా బీసీ-డి కేటగిరీ విద్యార్థులకు సుమారు రూ.300 కోట్ల ఫీజులను మంగళవారం విడుదల చేసింది. ఉగాదిలోగా మిగిలిన రూ.900 కోట్లు కూడా విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనిపై కాలేజీ యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## హైదరాబాద్‌లో తీవ్ర గ్యాస్ కొరత.. పెళ్లి వేడుకలపై నీలినీడలు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రభావం ఇప్పుడు దేశీయంగా శుభకార్యాలపై తీవ్రంగా పడుతోంది. అంతర్జాతీయంగా సరఫరా నిలిచిపోవడంతో ఎల్‌పీజీ గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో ఈ నెల 18 నుంచి మొదలుకానున్న పెళ్లిళ్ల సీజన్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే వేడుకలకు ఏర్పాట్లు చేసుకున్న కుటుంబాలు, అతిథులకు భోజనాలు ఎలా పెట్టాలో తెలియక ఆందోళన చెందుతున్నాయి. హైదరాబాద్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లు దాదాపుగా నిలిచిపోయాయి. గ్యాస్ అందుబాటులో లేక నగరంలోని చాలా హోటళ్లు, రెస్టారెంట్లు ఇప్పటికే మూతపడ్డాయి. దీని ప్రభావం నేరుగా క్యాటరింగ్ రంగంపై పడింది. భారీ ఆర్డర్లు తీసుకున్న నిర్వాహకులు, గ్యాస్ లేకుండా వంటలు చేయడం సాధ్యం కాదని చేతులెత్తేస్తున్నారు. తీసుకున్న అడ్వాన్సులను సైతం తిరిగి ఇచ్చేస్తున్నారు. మార్చి 18 నుంచి మే వరకు పెళ్లిళ్లకు అధికంగా ముహూర్తాలు ఉన్నాయి. కేవలం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే సుమారు 15 వేల వివాహాలు జరగవచ్చని ఒక అంచనా. నగర శివార్లలోని ఫంక్షన్ హాళ్లు, రిసార్టులు జూన్ వరకు బుక్ అయిపోయాయి. అయితే, గ్యాస్ కొరతతో ఇప్పుడు పెళ్లిళ్లు జరపాలా లేక వాయిదా వేసుకోవాలా అని చాలా కుటుంబాలు పునరాలోచనలో పడ్డాయి. ఈ సంక్షోభం కేవలం పెళ్లిళ్లకే పరిమితం కాలేదు. ఈ సీజన్‌ను నమ్ముకుని జీవించే వేలాది మంది ఉపాధిని దెబ్బతీస్తోంది. క్యాటరింగ్ సిబ్బందితో పాటు పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, డెకరేటర్లు, బ్యాండ్ మేళం వంటి ఎన్నో అనుబంధ రంగాల వారికి పని లేకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. పశ్చిమాసియా నుంచి చమురు, గ్యాస్ దిగుమతులు నిలిచిపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని, యుద్ధం ఇలాగే కొనసాగితే నిత్యావసరాల ధరలు కూడా పెరగొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకే ప్రజా దర్బార్ : చింతలూరులో ఎమ్మెల్యే బండారు

**కోనసీమ, పతాకం న్యూస్:** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మండలంలోని చింతలూరు నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆయన శుక్రవారం ప్రజా దర్బార్ అధికారులతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు స్వీకరించారు. మొత్తం 32 వినతులు అందగా అందులో పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజల నుంచి అందిన ప్రతీ వినతి పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.రాజు తహసిల్దార్ కేజే ప్రకాష్ బాబు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలపై గ్యాస్ గుదిబండ..




**మన్యం జిల్లా, పతాకం న్యూస్:** పౌరులపై వంట గ్యాస్ గుదిబండ పడి నడ్డి విరుగుతోంది. గ్యాస్ కొరతతో ఇప్పటికే అనేక అల్పాహార హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు మూతపడ్డాయి. గ్యాస్‌కు కొరత లేదని, పుష్కలంగా అందుబాటులో ఉందని జిల్లా అధికారులు చెపుతున్నా కానీ క్షేత్ర స్థాయిలో గ్యాస్ కొరతతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. అమెరికా ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న నేపథ్యంలో చమురు కొరత ఏర్పడింది. సాధారణ పరిస్థితుల్లో గ్యాస్ బుకింగ్‌కు ఎటువంటి అడ్డంకులు, నిబంధనలు ఉండేవి కావు. ఉదయం 5 లేదా 6గంటలకు ఆన్లైన్ బుకింగ్ చేసుకుంటే అదేరోజు ఉదయం 10 లేదా 11 గంటలకు గ్యాస్ ఇళ్లకు చేరేది. అంటే ఒక పూటలోనే గ్యాస్ ఇంటికి చేరేది. శుభకార్యాలు, ఫంక్షన్లు వంటి అవసరం ఉన్నా అదనంగా గ్యాస్ లభ్యమయేది.కానీ ప్రస్తుతం గ్యాస్ బుకింగ్ చేసుకున్నా రావడం లేదు. ఒకసారి బుక్ చేస్తే మళ్లీ 45 రోజుల వరకు గ్యాస్ ఇవ్వడం లేదు. బుకింగ్ కోసం నేరుగా గ్యాస్ ఆఫీసుకు వెళ్తే సవాలక్ష నిబంధనలు, కారణాలు చెప్పి లబ్ధిదారులను ఒట్టి చేతులతో పంపిస్తున్నారు. అనేక మంది ఇళ్లల్లో డబుల్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే అదనంగా గ్యాస్ బుకింగ్ చేసుకుంటామంటే కుదరడం లేదు. అదనపు సిలెండర్ ఉన్నా ఫలితం శూన్యం. అందరితో పాటు గ్యాస్ కొరత ఎదుర్కో వలసిన పరిస్తితి నెలకొంది.కొత్త కనెక్షన్‌కు ఇబ్బందులు కొత్త కనెక్షన్ కావాలని వెళ్లిన వారికి ఇవ్వడం లేదు. కొత్తవి అందుబాటులో లేవని చెపుతున్నారు. లేదా బిజీగా ఉన్నాం తర్వాత వస్తే కొత్త కనెక్షన్ ఇస్తామని చెబుతున్నారు. జిల్లాలో ప్రతి రోజూ 5వేల సిలిండర్ల వరకు డిమాండ్ ఉంది. లక్షా28వేలకు పైబడి వినియోగదారులు ఉన్నారు. పెరిగిన ధరలు గ్యాస్ కొరత కారణంగా టిఫిన్ సెంటర్లు అనేకం మూతపడ్డాయి. కొన్ని మాత్రమే తెరుస్తున్నారు. దీంతో టిఫిన్ ధరలను పెంచేస్తున్నారు. కొన్ని చోట్ల కట్టెలతో వండుతున్నారు. కొంత మంది ఏదో విధంగా గ్యాస్ సంపాదించి అదనంగా ఖర్చులకు తగ్గట్టుగా టిఫిన్ ధరలను పెంచేస్తున్నారు. గ్యాస్ బుకింగ్ ఆన్ లైన్లో చేసుకోవచ్చుగ్యాస్ సరఫరాను పంపిణీ కంపెనీలే చేస్తున్నాయి. ఇదివరకు సరిఫరా సరిపడా అందుబాటులో ఉండేది. తక్కువ నిల్వలు వస్తున్న కారణంగా ఇటీవల 25 రోజులకు ఒకసారి గడువు పెట్టారు. ప్రస్తుతం 45 రోజులకు ఒకసారి మాత్రమే సరఫరాకు అనుమతి ఇస్తున్నారు. కమర్షిల్ గ్యాస్ అందుబాటులో లేదు. వారం రోజుల క్రితమే సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం 45 రోజులకు ఒకసారి గృహ వినియోగ గ్యాస్ అందిస్తున్నాం.గ్యాస్ సరఫరా నిర్వాహకుడు, పార్వతీపురంఅవసరాలు తగ్గించుకుంటున్నాంగ్యాస్ వినియోగాన్ని తగ్గించుకున్నాం. మాకు నెలకు ఒక సిలెండర్ అవసరమవుతుంది. కానీ 45 రోజులకు ఒక సిలెండర్ ఇస్తున్నారు. దీంతో కొన్ని అవసరాలను తగ్గించుకున్నాం. స్నానం కోసం నీళ్లు కాచేవారం. ఇపుడు చన్నీళ్లతో స్నానం చేస్తున్నాం. ఎక్కువ సేపు ఉడికించాల్సిన వంటలను తగ్గించాం. కంది పప్పు, గింజలు వంటి కూరలు తగ్గించాం. ఇలా వినియోగాన్ని తగ్గించుకున్నాము.ఎం. తవిటమ్మ, వైకెఎం నగర్.హోటల్ మూసేశాను వాణిజ్య (కమర్షిల్) గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. గృహ వినియోగ గ్యాస్‌ను వాడితే కేసులు పెడుతున్నారు. దీంతో గ్యాస్ కొరత ఏర్పడి హోటళ్లు, టిఫిన్ దుకాణాలు, పానీపూరి సెంటర్లు అనేకం మూత పడ్డాయి. మరో రెండు రోజుల్లో అన్నీ మూతపడే పరిస్థితి కనిపించిస్తోంది.కె.శివ, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడునెలాఖరు వరకు గ్యాస్ ఇవ్వమంటున్నారు నేను గత నెల 13న గ్యాస్ విడిపించాను. ప్రస్తుతం గ్యాస్ బుకింగ్ చేశా. ఏజెన్సీకి వెళ్లి అడిగితే గ్యాస్ ఇప్పట్లో ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారు. అదేమని అడిగితే 45 రోజులకు ఒక సిలెండర్ మాత్రమే కె. జానకి, గ్యాస్ లబ్ధిదారు, బెలగాంజిల్లాలో గ్యాస్ కొరత లేదని, వినియోగదారులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. యుద్ధ వాతావరణం నేపథ్యంలో గ్యాస్ కొరత ఏర్పడుతుందనే అసత్య ప్రచారాలను నమ్మొద్దని, వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా ఎల్‌పిజి గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. గురువారం ఆయన జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీలను ఆకస్మికంగా తనిఖీ చేసి, నిల్వలు, పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్యాస్ ఏజెన్సీలను పరిశీలించినట్లు చెప్పారు. జిల్లాలోని 15 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సుమారు 1.20 లక్షల మంది వినియోగదారులకు గ్యాస్ అందుతోందని వివరించారు. ప్రస్తుతం గోడౌన్లలో 9వేలకు పైచిలుకు సిలిండర్ల నిల్వలు ఉన్నాయన్నారు. విశాఖపట్నంలోని బాట్లింగ్ ప్లాంట్ల నుండి ప్రతిరోజూ జిల్లాకు గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నట్లు పేర్కొన్నారు. రోజువారీగా 3 నుండి 4 వేల బుకింగ్లు సజావుగా జరుగుతున్నాయని, అయితే యుద్ధ వాతావరణం వల్ల గ్యాస్ కొరత ఉండవచ్చనే అపోహతో దాదాపు 80 శాతం బుకింగ్స్ పెరిగినట్లు తెలిపారు. ఎటువంటి అపోహాలకు గురికావద్దని, అవసరం లేకపోయినా గ్యాస్ బుక్ చేసుకొని కృత్రిమ కొరత సృష్టించొద్దని విజ్ఞప్తి చేశారు.గ్యాస్ ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌గ్యాస్ సరఫరాలో ఫిర్యాదుల కొరకు జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జెసి తెలిపారు. గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలు వసూలు, బుకింగ్ చేసినా సరఫరా చేయక పోవడం వంటి సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 70130 60665కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోగా సమస్యను పరిష్కరించి, తీసుకున్న చర్యలను వినియోగదారులకు తెలియజేస్తామని జెసి హామీ ఇచ్చారు. తనిఖీల్లో జిల్లా సరఫరాల అధికారి బి.అశోక్ కుమార్, గ్యాస్ ఏజెన్సీల డిస్ట్రిబ్యూటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## నిలిచిన కొబ్బరి ఎగుమతులు.. ఆందోళనలో రైతులు



**కోనసీమ, పతాకం న్యూస్:** పశ్చిమ ఆసియాలో భీకర యుద్ధం జరుగుతున్న వేళ కోనసీమ కొబ్బరి ఎగుమతులకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ఎగుమతి చేసిన కొబ్బరి కాయల కంటైనర్లు నౌకాశ్రయాల్లో నిలిచిపోవడంతో ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. శ్రీరామనవమికి ఏటా ధరలు పెరుగుతుండగా ఈసారి పతనం కావడం వల్ల రైతులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా చేస్తున్న యుద్ధ ప్రభావం కొబ్బరి ఉత్పత్తులపైనా పడింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక కొబ్బరి పంట దేశంలోనే ప్రసిద్ధి. గల్ఫ్ దేశాలకు తమిళనాడు, ఏపీల నుంచి ఓడల ద్వారా కొబ్బరి కాయలు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం రంజాన్ మాసంలో గల్ఫ్ దేశాల్లో కొబ్బరికి మంచి డిమాండ్ ఉంది. కువైట్, ఒమన్, దుబాయ్, ఇరాన్, సౌదీలకు కొబ్బరికాయలు ఎగుమతులు చేస్తున్నారు. యుద్ధం భీకరంగా జరుగుతున్న వేళ ముంబై, చెన్నై, తూత్తుకుడి పోర్టుల దగ్గర కొబ్బరి కాయలతో ఉన్న కంటైనర్లు నిలిచిపోయాయి. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో, సరకు రవాణా ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియని అనిశ్చిత పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా ఓడ రేవుల్లో ఉన్న కొబ్బరికాయల్ని అక్కడే తక్కువ ధరకు విక్రయించుకుని కొబ్బరి వ్యాపారులు నష్టపోతున్నారు. గత ఏడాది కోనసీమలో సెప్టెంబరు నుంచి డిసెంబర్ వరకు కొబ్బరికాయల ధరలు అనూహ్యంగా పెరిగాయి. వెయ్యి పచ్చి కొబ్బరి కాయల ధర రూ.25 నుంచి రూ.27 వేలకు ఎగబాకింది. ఆ తర్వాత మార్కెట్‌లో చోటు చేసుకున్న ప్రతికూల వాతావరణంలో ధరలు తగ్గుతూ వచ్చాయి. ఈ ఏడాది జనవరి నుంచి రైతులకు ధరలు కాస్త ఊరటనిచ్చాయి. గత నెలలో శివరాత్రి మహా పర్వదినానికి కూడా వెయ్యి పచ్చి కొబ్బరికాయల ధర రూ.18 నుంచి రూ.20 వరకు పెరిగింది. యుద్ధం ప్రభావంతోపాటు శ్రీరామనవమికి పెద్దగా డిమాండ్ లేకపోవడంతో కోనసీమ కొబ్బరి మార్కెట్ డీలా పడిపోయింది. "యుద్ధంతో? ఎగుమతులు పడిపోయాయి. కొబ్బరి కాయను ఎవరు కొనట్లేదు. దిగుమతులు కూడా పడిపోయాయి. మొన్నటి వరకు 800, 1000, 1200 ఉండేది. ఇపుడు 400, 500కు పడిపోయింది. కాయలు దింపడానికి ఖర్చులు ఎక్కువయ్యాయి. మగవాళ్లు కూలీకి 700 తీసుకుంటారు. వేసవి కాలంలో నీళ్లు పెట్టలేక నరకం కనిపిస్తుంది. కరెంటు టైంకి రాదు. డీజిల్‌తో వ్యవసాయం చేయరాదు. బ్రతకడం చాలా కష్టం". అని రైతులు తెలియజేస్తున్నారు. యుద్ధం నేపథ్యంలో కొబ్బరికాయల ఎగుమతులు నిలిచిపోయాయి. తమిళనాడు నుంచి అధికంగా పచ్చి కొబ్బరికాయల ఎగుమతులు జరుగుతున్నాయి. అలాగే ఏపీలో శ్రీరామనవమికి కొబ్బరికాయలకు మంచి ధర వస్తుందని ఆశించిన రైతులకు భంగపాటు తప్పలేదు. యుద్ధ ప్రభావంతో కోనసీమలోని కొబ్బరి మార్కెట్?లో ప్రస్తుతం వెయ్యి కొబ్బరి కాయలు రూ.13 నుంచి రూ.14 వేలకు ధర పతనమైంది. ఏటా శ్రీరామనవమికి కొబ్బరి కాయల ఎగుమతులు పెరిగి ధర కూడా ఆశాజనకంగా ఉంది. అదే ఆశతో రైతులు, వ్యాపారులు నిల్వ చేశారు. కానీ అందుకు భిన్నంగా ధరలు పతనమవ్వడంతో వారి అంచనాలు తారుమారు అయ్యాయి. అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందా? ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమై కొబ్బరి ధర ఆశాజనకంగా మారుతుందా? అని కోనసీమ రైతులు, వ్యాపారులు ఎదురు చూస్తున్నారు.

## గ్యాస్ కృత్రిమ కొరత సృష్టించవద్దు

**పాలకొండ, పతాకం న్యూస్:** గ్యాస్ కృత్రిమ కొరత సృష్టించవద్దని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ దిలీప్ చక్రవర్తి హెచ్చరించారు. వెలగవాడ హెచ్‌పీ గ్యాస్ గోదామును ఆయన సందర్శించారు. అక్కడ స్టాక్ నిల్వ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వినియో గదారులకు గ్యాస్ సరఫరా చేయాలన్నారు. వినియోగదారులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఫస్థానిక వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి గురువారం తనిఖీ చేశారు. గ్యాస్ కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే 7013060655 నెంబర్‌కు తెలియజేయాలన్నారు.



## ప్రమాద బాధితులకు నిర్మించిన షెడ్లు ప్రారంభం



**మామిడికుదురు, పతాకం న్యూస్:** మామిడికుదురు ఆల్ కాస్ట్ కాలనీ అగ్నిప్రమాద కుటుంబాలకు నిర్మించిన షెడ్లను రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ ప్రారంభించారు అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇళ్ల స్థానంలో ఎంఎల్ఎ ఆదేశాల మేరకు రూ.5.50 లక్షలతో నూతన షెడ్ల నిర్మాణం చేపట్టారు నూతనంగా నిర్మించిన షెడ్లను శాసనసభ్యులు ప్రారంభించి సంబంధిత కుటుంబాలకు అప్పగించారు.అదే విధంగా మానవతా మూర్తులు సంస్థ, పాలకొల్లు వాకర్స్ అసోసియేషన్ సమకూర్చిన నివాస సామాగ్రిని బాధిత కుటుంబాలకు అందించారు.ఈ సందర్భంగా ఎం ఎల్ ఎ మాట్లాడుతూ అందరికీ కరెంట్ మీటర్లను తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నష్టపోయిన కుటుంబాలకు ఇళ్ళ పట్టాలు ఇప్పించి వారికి గృహాలను నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాటిపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కేతా వెంకటలక్ష్మి, అల్లు సురేష్, ఇంటి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సరఫరాపై ఆందోళన వద్దు



**గుంటూరు, పతాకం న్యూస్:** యుద్ధ నేపథ్యంలో .... గ్యాస్ సరఫరా పై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు చూసి వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారని, వాస్తవానికి గుంటూరు జిల్లాలో ఎలాంటి గ్యాస్ కొరత లేదని జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీ వాస్తవ తెలిపారు. ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో జేసీ శుక్రవారం సమీక్షించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మీడియాతో గృహవినియోగదారులకు సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అయితే సామాజికమధ్యంలో వస్తున్న వార్తలతో ఆందోళన చెంది అధికంగా బుకింగ్ చేస్తున్నారని తెలిపారు. దీంతో కొన్ని ఏజెన్సీల పరిధిలో గ్యాస్ సరఫరాలో ఆలస్యం జరుగుతుందని, దీనికి బాయ్స్ కొరత కూడా కారణమని చెప్పారు. సరఫరాలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో ప్రాధాన్యత సెక్టార్లైన హాస్పిటల్స్ హాస్టల్స్ వంటి వాటికి యధావిధిగా సరఫరా కొనసాగుతుందని తెలిపారు. అప్రాధాన్యత రంగాలకు ప్రస్తుతానికి బుకింగ్స్ నిలిచింది అన్నారు.

## ఇంటి పన్ను చెల్లించకపోతే జప్తు చేస్తాం



**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** వీరవాసరం పం చాయతీకి చెల్లించవలసిన ఇంటి పన్ను మొండి బకాయిలను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో జప్తు చేసే అవకాశం ఉందని పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మీ అన్నారు. పంచాయతీ పన్నులు వసూలు చేయడంలో గత కొద్ది రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వంద శాతం పన్నులు వసూలు చేయాలంటూ డిపిఒ ఆదేశాలు ఇవ్వడంతో వసూళ్లలో పంచాయతీ అధికారులు నిమగ్నమైయ్యారు. ఈ క్రమంలో వీరవాసరం పాలిటెక్నిక్ కళాశాల రూ.87,38,93 పన్నును వీరవాసరం పంచాయతీ చెల్లించాల్సి ఉంది. దీంతో పన్ను చెల్లించాలంటూ పంచాయతీ అధికారులు పలు దఫాలుగా సంబంధిత యజమానిని సంప్రదిస్తున్నట్లు వారు తెలిపారు. అయినప్పటికీ కళాశాల పన్ను చెల్లింపుకు ముందుకు రాని పరిస్థితి ఉందన్నారు. 2015-16 నుండి 2025-26 వరకు కళాశాల పన్ను చెల్లించడం లేదంటూ కార్యదర్శి తెలిపారు. నోటీసు అందుకోవడానికి కళాశాల యజమాని అందుబాటులో లేకపోవడంతో పన్ను చెల్లింపు వివరాలతో సెక్రటరీ అండ్ కరస్పాడెంట్ వర్ధినీటి సత్యనారాయణకు అడ్రస్ చేస్తూ కళాశాల తలుపులకు నోటీసు అంటించారు. చెల్లింపుకు ముందుకు రాని పక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వైభవతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పశు సంపద పెంపుతోనే ఆరోగ్యవంతమైన సమాజం



**అమలాపురం, పతాకం న్యూస్:** పశు సంపద పెంపుతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు అన్నారు.శుక్రవారం అమలాపురం మండలం సాకుర్రు గ్రామంలో నిర్వహించిన జాతీయ కఅత్రిమ గర్భధారణ అవగాహన సదస్సు మరియు లేగ దూడల అందాల పోటీల కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశు సంపదను కాపాడుకోవడం ద్వారానే స్వచ్ఛమైన పాలు పొంది, కల్తీని నివారించవచ్చునని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతను కొనియాడుతూ, పశుపోషణను లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పశువులకు హాస్టల్ సౌకర్యం వంటి విప్లవాత్మక పథకాల గురించి ప్రజలకు వివరించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, పశువుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కొనియాడారు.

## గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదు



**తూర్పుగోదావరి, పతాకం న్యూస్:** జిల్లాలో ఎల్‌పిజి గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితులపై జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రతి గ్యాస్ ఏజెన్సీ తమ వద్ద ఉన్న ప్రస్తుత స్టాక్, నమోదైన బుకింగ్‌లు, గ్యాస్ సరఫరాకు పట్టే రోజుల వివరాలను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతుల కారణంగా కొంతమంది వినియోగదారులు అధికంగా గ్యాస్ బుకింగ్‌లు చేస్తున్నారని తెలిపారు. అయితే జిల్లాలో గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, వినియోగ దారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 212 మెట్రిక్ టన్నుల గ్యాస్ స్టాక్, 14,829 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో రోజువారీ సగటు వినియోగం సుమారు 11 వేల సిలిండర్లుగా ఉండగా, రీఫిల్లింగ్ యూనిట్ల ద్వారా ఎప్పటికప్పుడు సరఫరా జరుగుతోందన్నారు. గృహ వినియోగదారులతో పాటు సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రులకు గ్యాస్ సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని గ్యాస్ ఏజెన్సీలకు సూచించారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించకుండా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వదంతులను నమ్మవద్దని, జిల్లా అధికారిక మార్గాల ద్వారా విడుదలయ్యే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలను కోరారు. గ్యాస్ బుకింగ్ లేదా సరఫరా సంబంధిత సమస్యలు తలెత్తిన పక్షంలో 8074661259 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సప్లయి అధికారి వి.పార్వతి, సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత లేకుండా చూస్తా: ఉత్తమ్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా పరిణామాలపై తెలంగాణ ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గుర్తు చేస్తూ.. ప్రస్తుత పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ పలు కీలక వివరాలను వెల్లడించారు.

# వేసవికాలంలో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి..

వేసవికాలంలో రోజూ కొబ్బరినీళ్లను తాగాల్సిందే.. ఎందుకంటే.. వేసవికాలం అనగానే మండే ఎండ, అధిక చెమట, అలసట, నీరసం వంటి సమస్యలు గుర్తుకు వస్తాయి. వేసవికాలంలో శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవడం చాలా అవసరం. చెమట ద్వారా శరీరం ద్రవాలను ఎక్కువగా కోల్పోతుంది. దీని వల్ల డీహైడ్రేషన్ బారిన పడే అవకాశాలు పెరుగుతాయి. శరీరం హైడ్రెటెడ్ గా ఉండడం వల్ల శరీర ఆరోగ్యం మెరుగుపడుతుంది. వేసవికాలం అనగానే మండే ఎండ, అధిక చెమట, అలసట, నీరసం వంటి సమస్యలు గుర్తుకు వస్తాయి. వేసవికాలంలో శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవడం చాలా అవసరం. చెమట ద్వారా శరీరం ద్రవాలను ఎక్కువగా కోల్పోతుంది. దీని వల్ల డీహైడ్రేషన్ బారిన పడే అవకాశాలు పెరుగుతాయి. శరీరం హైడ్రెటెడ్ గా ఉండడం వల్ల శరీర ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీర్ణక్రియ సరిగ్గా జరుగుతుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. మెదడు పనితీరు కూడా మెరుగుపడుతుంది. కనుక వేసవిలో ద్రవాలతో పాటు ద్రవాలు ఉన్న ఆహారాలను తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. ముఖ్యంగా బయట ఎక్కువగా పనిచేసే వారు ద్రవాలను ఎక్కువగా తీసుకోవాలి. అయితే చక్కెరలు ఎక్కువగా ఉండే శీతల పానీయాల కంటే కొబ్బరి నీటిని తీసుకోవడం వల్ల మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు. కొబ్బరినీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ తగ్గడంతో పాటు శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ తిరిగి అందుతాయి. ఇది సహజమైనది, ఇందులో క్యాలరీలు కూడా తక్కువగా ఉంటాయి. వేసవికాలంలో కొబ్బరి నీటిని తాగడం వల్ల కలిగే ఆరోగ్యకరమైన ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. కొబ్బరి నీరు శరీరాన్ని త్వరగా హైడ్రేట్ చేస్తుంది. ఎండలో ఎక్కువగా తిరిగిన తరువాత కొబ్బరి నీటిని తీసుకోవడం మంచిది. చెమట కారణంగా శరీరం ముఖ్యమైన ఖనిజాలను కోల్పోతుంది. కొబ్బరి నీటిని తాగడం వల్ల పొటాషియం, సోడియం, మెగ్నీషియం, క్యాల్షియం వంటి ఎలక్ట్రోలైట్స్ తిరిగి శరీరానికి అందుతాయి. శరీరంలో ద్రవసమతుల్యం పునరుద్ధరించడంతో పాటు కండరాల నొప్పులు తగ్గుతాయి. కొబ్బరి నీటిని తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయి. అలసట, చర్మంపై రాషెస్, తలనొప్పి వంటి ఎండ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. వేసవిలో జీర్ణక్రియ సమస్యలు తలెత్తడం సహజం. కొబ్బరి నీటిని తీసుకోవడం వల్ల దీనిలో ఉండే బయోఆక్టివ్ ఎంజైమ్స్, సహజ ఆల్కలైన్ గుణాలు జీర్ణాశయానికి ఉపశమనాన్ని కలిగిస్తాయి. దీంతో ఆమ్లత్వం, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. వేసవికాలంలో శక్తిని త్వరగా కోల్పోతూ ఉంటారు. అటువంటి సమయంలో కొబ్బరి నీటిని తాగడం వల్ల దీనిలో ఉండే సహజ చక్కెరలు, మెగ్నీషియం శరీరానికి స్థిరమైన శక్తిని అందిస్తాయి. కొబ్బరి నీరు సహజంగానే డయురెటిక్ గా పని చేస్తుంది. ఇది మూత్రవిసర్జనను పెంచి శరీరంలో విషాలను, వ్యర్థపదార్థాలను బయటకు పంపుతుంది. దీంతో మూత్రపిండాల్లో రాళ్ల వంటి సమస్యలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా తయారవుతుంది. కొబ్బరి నీటిలో విటమిన్ సి, విటమిన్ బి, పొటాషియం, క్యాల్షియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇవి శరీరం మొత్తం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.



కొబ్బరి నీటిలో పొటాషియం అధికంగా ఉంటుంది. కనుక ఈ నీటిని తాగడం వల్ల బీపీ అదుపులో ఉండడంతో పాటు గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ విధంగా కొబ్బరి నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీరు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ వీటిని కూడా మితంగా తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. ముఖ్యంగా మూత్రపిండాల వ్యాధులు, క్రానిక్ కిడ్నీ డిసీజ్, అధిక రక్తపోటు, పొటాషియం ఉన్న ఆహారాలను మితంగా తీసుకునే వారు కొబ్బరి నీటిని వైద్యుల సూచన మేరకు తీసుకోవడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు.

## ఇరాక్‌లో కుప్పకూలిన అమెరికా భారీ యుద్ధ విమానం



**ఇరాన్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ ... ఇరాక్ భూభాగంలో అమెరికాకు చెందిన భారీ యుద్ధ విమానం కుప్పకూలింది. అమెరికా వైమానిక దళానికి చెందిన కెసి-135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానం ఇరాక్ పశ్చిమ ప్రాంతంలో కూలిపోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో ఆరుగురు అమెరికా సైనికులు మరణించారని ఇరాన్ మీడియా ప్రతినిధులు వెల్లడించారు. అమెరికా విమానాన్ని తామే కూల్చివేసినట్లు కొన్ని ఇరాన్ అనుకూల వర్గాలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాయి.ఇరాన్ వాదనలను అమెరికా రక్షణ శాఖ తోసిపుచ్చింది. విమానం కూలిపోయిన మాట వాస్తవమేనని, అయితే ఇది శత్రువుల దాడి వల్ల జరగలేదని స్పష్టం చేసింది. సాంకేతిక లోపం లేదా ప్రమాదవశాత్తూ రెండు విమానాలు ఒకదానికొకటి తగిలి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నామని తెలిపింది. ఈ ఘటనలో మరొక విమానం సురక్షితంగా ల్యాండ్ అయినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో భాగంగా ఈ విమానం విధులు నిర్వహిస్తోంది. విమానంలో ఉన్న ఐదుగురు లేదా ఆరుగురు సిబ్బంది కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ అక్రమంగా సాగిస్తున్న యుద్ధానికి సహకరిస్తున్న స్థావరాలను మూసివేయల్సిందిగా పొరుగున గల గల్ఫ్ అరబ్ దేశాలను ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ కోరారు. లేనిపక్షంలో వాటిపై దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీంనేతగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంపై స్పందించారు. పూర్తిగా సాధించేవరకు ప్రతీకారానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. కీలకమైన హార్మూజ్ జలసంధిని మూసివేయాలని ఆదేశించారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీలు బాగుపడేదెప్పుడు?

## వృథాగా ఉన్న గోదాలు, కళ్లాలు.. రైతులకు సక్రమంగా అందని సేవలు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు(ఏఎంసీ) నిస్తేజంగా మారాయి. రైతులకు సేవలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఏఎంసీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో ఐదేళ్ల పాటు దయనీయ పరిస్థితిని ఎదుర్కొన్నాయి. వాటిద్వారా రైతులకు ఎలాంటి సేవలు అందలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బాగుపడతాయని అంతా భావించారు. అయితే రెండేళ్లు అవుతున్నా వాటి పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. రైతు బంధు పథకం పక్కాగా అమలు చేయడం లేదు. పలు గోదాములు, కళ్లాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నిధుల కేటాయింపు లేకపోవడంతో రైతులకు సక్రమంగా సేవలు అందడం లేదు. జిల్లాలో నరసన్నపేట, శ్రీకాకుళం, పొందూరు, జలుమూరు, ఆమదాలవలస, కోటబొమ్మాళి, పాతపట్నం, కంచిలి, పలాస, పాతపట్నం, హిరమండలం, ఎచ్చెర్లలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఒక్కో మార్కెట్ కమిటీలో 3వేల మెట్రిక్ టన్నుల ధాన్యం భద్రపరిచేందుకు వీలుగా గోదాములు ఉన్నాయి. అలాగే రైతులు ధాన్యం ఆరబెట్టేందుకుగానూ రెండు, మూడేసి చొప్పున పెద్దపెద్ద కళ్లాలు నిర్మించారు. అయితే, కోట్లాది రూపాయలతో నిర్మించిన గిడ్డంగులు వృథాగా పడిఉన్నాయి. గత ఆరు సంవత్సరాలుగా గోదాములు, కళ్లాలను వినియోగించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి. దీంతో ఈఏడాది తుఫాన్ల సమయంలో రైతులు పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. కొన్నిచోట్ల పంట తడిసిపోవడంతో నష్టపోయారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు అవుతున్నా ఇంకా మార్కెట్ కమిటీలు బాగుపడలేదు. ఏఎంసీ సిబ్బంది కేవలం మార్కెట్ సెస్ మీద మాత్రమే దృష్టి సారిస్తున్నారు. నరసన్నపేట మండలంలో మడపాం కేంద్రం వద్ద వాహనాలను తనిఖీ చేసి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే మాదిరిగా టమాట, చెరుకు, అరటి, కూరగాయలు, పశువులు రవాణా చేసే వాహనాల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కొన్ని గోదాములను ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇచ్చి సిబ్బంది చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి సమయాల్లో ఏఎంసీ కార్యాలయాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. పశువులు, గొర్రెల పెంపకం దారులు వీటిని ఆవాసులుగా ఏర్పాటు చేసుకుంటున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతు బంధు పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం ద్వారా.. రైతులు పండించిన పంటలను మార్కెట్ కమిటీలోని గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. నిల్వ చేసిన పంటలపై మార్కెట్ కమిటీలు రైతులకు 60 శాతం వరకూ నామమాత్రపు వడ్డీతో రుణాలు అందజేసేవారు. మార్కెట్‌లో మద్దతు ధర ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు ఆ పంటను విక్రయించుకుని.. రుణాలు తీర్చేవారు. అలాగే మార్కెట్ కమిటీ పరిధిలో వైద్య, పశు వైద్యశిబిరాలు కూడా నిర్వహించేవారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు పథకాన్ని నిలిపేశారు. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. రైతు బంధు పథకాన్ని మళ్లీ అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో కొన్ని మార్కెట్ కమిటీ కార్యాలయాలు రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. నరసన్నపేట మార్కెట్ యార్డులో రాత్రివేళ గంజాయి బ్యాచ్, మందుబాబులు ఇక్కడ మకాం వేస్తున్నారు. ఇదే ప్రాంతంలో వేరే హౌసింగ్ గోదాములు ఉన్నాయి. మందుబాబుల కారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే రూ.కోట్లలో నష్టం జరిగే అవకాశం ఉంది.




## మన ఛాంపియన్లు మళ్లీ బరిలో దిగేది ఎప్పుడంటే?



2026 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌ను భారత్ ఘనంగా ముగించింది. నెల రోజుల పాటు సాగిన ఈ టోర్నమెంట్‌లో టీమ్ఇండియా క్రికెట్ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ఈ టోర్నీలో మొత్తం తొమ్మిది మ్యాచ్‌లు ఆడగా, ఎనిమిది విజయాలు సాధించింది. సూపర్ 8లో సౌతాఫ్రికాపై ఓడినా, ఆ తర్వాత వరుస విజయాలతో టైటిల్ అందుకుంది. దీంతో దేశమంతా సంబరాల్లో మునిగితేలింది. అయితే వరల్డ్‌కప్ గ్రాండ్‌గా ముగిసింది. మరి టీమ్ఇండియా మళ్లీ ఎప్పుడు బరిలోకి దిగనుంది? మన ఛాంపియన్లు భారత జెర్సీ ధరించి మళ్లీ ఎప్పుడు మైదానంలో కనిపించనున్నారో మీకు తెలుసా?

తాజాగా వరల్డ్ కప్ ముగిసింది. దీంతో రెండు వారాలపాటు ఆటగాళ్లు విశ్రాంతి తీసుకోనున్నారు. ఇక ఆ తదుపరి రెండు నెలలపాటు క్రికెట్ ప్రేమికులను ఫ్రాంచైజీ క్రికెట్ అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ అలరించనుంది. ఫ్యాన్స్?ను అలరించేందుకు క్యాష్ రిచ్ లిగ్ ఐపీఎల్ సిద్ధమవుతుంది. ఇదే నెల 28న ఈ టోర్నీ ప్రారంభం కానుంది. ఇన్ని రోజులు ఒక జట్టుగా ఆడుతూ, ట్రోఫీ కోసం కష్టపడ్డ మనోళ్లంతా ఒక్కో కలర్ జెర్సీలో ప్రత్యర్థులుగా పోటీ పడనున్నారు. సీనియర్లు ధోనీ, రోహిత్, కోహ్లీతోపాటు కుర్రాళ్లు కూడా ఈ బరిలో దిగి సత్తా చాటనున్నారు. దాదాపుగా రెండు నెలలు ఈ లీగ్ సాగుతుంది. అంటే మే నెల ముగిసేదాకా టీమ్ఇండియా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడదన్నమాట! ఇక మే నెల ఆఖరి వారం దాకా ఐపీఎల్ ఉంటుంది. ఆ తర్వాత టీమ్ఇండియా మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి దిగనుంది. టీ20 వరల్డ్?కప్ తర్వాత నేరుగా జూన్‌లోనే ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడనుంది. వరుస సిరీస్‌లతో భారత్ బిజీబిజీగా గడపనుంది. తొలుత జూన్‌నెలలో అఫ్గానిస్థాన్‌తో భారత్ తలపడనుంది.

దీనికి సంబంధించిన షెడ్యూల్ కన్ఫర్మ్ అయ్యింది. 2026 జూన్‌లో భారత్ పర్యటనకు అఫ్గానిస్థాన్ రానుంది. అఫ్గాన్ ఈ పర్యటనలో భారత్‌తో ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. దీంతో ఈ సిరీస్?లో స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మైదానంలోకి దిగనున్నారు. రెండు జట్ల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ జూన్ 6న ప్రారంభం కానుంది. ఆ తర్వాత అదే నెల 14న వన్డే సిరీస్ మొదలవుతుంది.

## యువీతో ప్రాక్టీస్ సెషన్.. పంత్ కెరీర్‌కు ప్లస్ అవుతుందా?



అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, ప్రభుసిమ్రన్ సింగ్... ఇలా పలు భారత క్రికెటర్లు ప్రస్తుతం అద్భుతంగా రాణిస్తున్నారు. మరి వీరికి మెంటార్, కోచ్ లేదా శిక్షణ ఇచ్చి రాటుదేలేలా చేసింది ఎవరో తెలుసా? టీమిండియా క్రికెట్ దిగ్గజం యువరాజ్ సింగ్. ప్రస్తుతం ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న టీమిండియా స్టార్ బ్యాటర్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ కూడా ఈ జాబితాలోకి చేరిపోయాడు. ఐపీఎల్ 2026 నేపథ్యంలో యువీ పర్యవేక్షణలో ముంబైలో పంత్ ప్రాక్టీస్ చేశాడు. యువరాజ్ సింగ్, రిషభ్ పంత్ కలిసి నాలుగు రోజుల పాటు బ్రబౌర్న్ స్టేడియంలో ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. యువీ.. పంత్‌కు బ్యాటింగ్‌లో కీలకమైన సూచనలు చేశాడు. బౌలర్లు సంధించిన బంతుల్ని యువీ పర్యవేక్షణలో పంత్ షాట్లు ఆడాడు. పంత్ గత కొంతకాలంగా వైట్ బాల్ క్రికెట్‌లో పెద్దగా రాణించడం లేదు. ఈ నేపథ్యంలో యువీతో ట్రైనింగ్ ప్రాధాన్యం సంతరించుకుంది. అభిషేక్ శర్మ, గిల్ వంటి ప్లేయర్లకు అద్భుతమైన ట్రైనింగ్ ఇచ్చి రాటు దేలేలా చేసిన యువీ.. పంత్‌ను కూడా ఆ స్థాయిలో తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాడు. యువీతో ప్రాక్టీస్ సెషన్.. పంత్ కెరీర్‌కు ప్లస్ అయ్యే అవకాశం ఉంది. ఈ ఐపీఎల్‌లో రాణించి తిరిగి టీమిండియాలో పునరాగమనం చేయాలనే తపనతో ఉన్నాడు.

యువీతో ప్రాక్టీస్ సెషన్ ముగిశాక పంత్ చెన్నైలోని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ క్యాంప్‌నకు హాజరయ్యాడు. ఈ క్యాంప్‌ను బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్, బ్యాటింగ్ కోచ్ లాన్స్ క్లూసెనర్ పర్యవేక్షించారు. ఆయుష్ బదోని, మొహ్సిన్ ఖాన్, హిమ్మత్ సింగ్, దిగ్వేశ్ సింగ్, మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్ తదితరులు హాజరవుతున్నారు. మార్చి 15 తర్వాత ఈ శిబిరం లఖ్‌నవూకు మారనుంది. ఏప్రిల్ 1న లఖ్‌నవూ.. ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది.



# వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పుణ్య దంపతులు
శ్రీమతి **జోగనపల్లి మంజుల**
శ్రీ **బోగెనపల్లి రఘునందన్‌రావు** గార్లకు
హార్థిక, హృదయపూర్వక

## వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**జోగినపల్లి రఘునందన్ రావు** గారు వెలమల ముద్దుబిడ్డ
గాంధీ చేతి కాగిత పర్టిశమ దుర్సెడ్ దగ్గర గత 40 సంవత్సరాలుగా
కరీంనగర్‌లో స్థిరపడి గాంధీ పేపర్ సంస్థను స్థాపించి రాష్ట్ర వ్యాప్తంగా
ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన వ్యక్తిగా అందరికీ
సుపరిచితుడు వ్యక్తి అభివృద్ధితో పాటు సమాజాభివృద్ధి ధ్యేయంగా
పర్యావరణ రక్షణ కర్తవ్యంగా భావించి అనేక ప్రభుత్వ, ప్రైవేటు
పాఠశాలలో అవగాహనసదస్సులు నిర్వహించిన ఘనుడు
స్ఫూర్తి కార్యక్రమం ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ రంగాలకు చెందిన
వెలమ బంధువులకు సేవ చేసిన సేవలకు గాను
సన్మాన కార్యక్రమాలు చేయటం..
రాబోయే తరాల కోసం వెలమ సంఘ సేవలను అందించడం కోసం,
ఎంత దూరమైనా వెళ్లే వ్యక్తిగా సుపరిచితుడుగా, వెలమలకు మద్దు బిడ్డగా
అందరూ నా వాళ్లు అనుకునే ఒక మంచి మనిషిగా ఉండే మీరు
మీ దంపతుల జీవితం నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ..

Happy Wedding Anniversary

**ఇట్లు: మీ వెలమ బంధువులు అభినందనలతో**

**నీలగిరి హనుమంతరావు, జనగం ప్రభాకర్ రావు**
**గండ్ర సంపత్‌రావు, డాక్టర్ లెక్కల శ్రీనివాస్**

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**